# పెన్నేటి కతలు

– రామకృష్ణారెడ్డి

## తూరుపునాటి కూలోళ్ళు

ఏతేటా ఆమని మొదులయే తప్పేటికల్లా, తూరుపు నాటి కొత్త కూలోళ్ళు దిగుతారు. కొత్త కూలోళ్ళంటే వాళ్ళు కొత్తోళ్ళేం గాదు, యాటా వొచ్చే వాళ్ళు కొత్తోళ్ళెట్టయితారు? ఉండూరోళ్ళు గాక, ఆ టయానికట్టా వొచ్చి ఆరొంత ఆమని అయిపోతానే, మల్లా ఎక్కడోళ్ళక్కడికి పోయే దాన వాళ్ళను కొత్త కూలోళ్ళంటారు. యాన్నో దేసెంలో యేయో పచ్చులు ఒక టయంలో వొచ్చి రోన్నాళ్ళుండి, మల్లా వొచ్చినతావుకు ఎగిరిపోతా వుంటాయని సెప్తారే, అట్ట యీళ్ళు గు డకా వొచ్చి పోతాంటారు. రాడం, పోడం అట్టుంటాదని సెప్పడం తప్ప. పచ్చులకూ, మనుసులకూ యాడన్నా సమందమా?

అప్పరే గానీ అందరికీ తెల్సిందే … తూరుపు నాడంటే యాన్నో పొద్దు పొడ్సేకాడని కాదు, వాళ్ళంతా బద్వేలూ, ఆ పక్క కొండ కింది పల్లెలోళ్ళే. పెద్ద దూరాబారమోళ్ళు గాదు. వాళ్ళకు నిత్తెకరువు. ఎప్పుడొచ్చినా, సెరువులో నీళ్ళు ల్యాక యీ యేడు పమల్లే వంటా వుంటారు. వాళ్ళ కరువూ, ఆ కరువు బతుకులూ సూస్తావుంటే … 'ఒరే, యీళ్ళు యిన్నేండ్ల నుంచీ యిట్టనే ఎట్ట బతుకుతా వుండారబ్బా' అని యిస్మితమయితాది.

ఎప్పుడూ వొచ్చే మనిసి యెవురో ఒకరు రానట్టు కనుక్కోని, వలానా ఆయప్పో, ఆయమ్మో రాలేదేమని అడిగితే … "కాలమైపాయేనే" అని, అద్దెలీదా అన్నెట్టు సెప్తారు. "ఎట్టా? ఏమొచ్చి పాయెనబ్బా?" అనడిగితే, "ఏమొచ్చేదేముంది? పనులు ల్యాకపాయె, ఓపికున్నోళ్ళంతా దేసెం మీద పడిపోయిరి. ఆ మనిసి పొల్యాకపాయె, పాయె". అంతే! ఆ మనిసి కత అయిపాయె. ఆయప్పో, ఆయమ్మో యాటా పనుల కోసం వొచ్చేవోళ్ళే. పని ఎతుక్కొంటావొచ్చే. శకితి వున్నప్పుడు వొచ్చినారు, లేనప్పుడు 'కాలమై పాయిరి'. ఇట్టా వున్నెప్పుడు, 'యిన్నేండ్ల నుంచీ ఎట్టా బతుకుతా వుండారబ్బా!' అని ఎందుకనిపిచ్చుదూ?

వాళ్ళు ఊళ్ళో దిగ్గినోజుకూ, పనులైపోయి ఊళ్ళకు తిరిగిపోయేతప్పటికీ శానా తేడా వుంటాది. రోజూ వల్లో సూస్తావుండే దాన వలానా అని కనుక్కోవాల్సిందే గానీ ల్యాకపోతే, ఆ వొచ్చినోళ్ళు యేరే, యీ పోయే వాళ్ళు యేరే అనుకోవాల్సిందే. అంత మారిపోయుంటారు! వచ్చినోజున వుతికిన గుడ్డలు కట్టుకోని, నమురు వూసి అనగదువ్విన నెత్తుల్తో, నగుతా నగుతా వుంటారు. ఆ నగుతాన్నెప్పుడు వాళ్ళు నోయిపోళ్ళయితే నోయిను కనపడ్తానే వుంటాది. వాళ్ళు ఎవురెవురికి మామూలుగా పనకు పోతావుంటారో వాళ్ళ యిండ్లకు నేరుగా వొస్తారు.

వొచ్చి, మరియాదలు అక్కర్లేని మంచి మట్టాలాల అందరూ బాగుండారా, పిన్నామెకు పెండ్లి జేసినారా, ఏ వూరి కిచ్చిరి, పెద్దాయిన కింగా పిల్లోళ్ళు పుట్నే లేదా… యిట్ట యిశారిస్తారు. రొంత సేపుటికల్లా, వాళ్ళు అడిగేదీ, యీళ్ళు సెప్పేదీ అయిపోతాది. యింగలేసి, యీ నచ్చత్రంలోకో, దేలెంకే లోకో, ల్యాకపోతే బెమ్మాండంగా వుండే పెన్నేట్లోకో పోయి పెండ్లోళ్ళ మాదిరి ఆ వూట యిడిది సేస్తారు. అయితే, యీ పెండ్లోళ్ళు పస్తు పండుకొనే పెండ్లోళ్ళు! మర్సటి రోజు నుంచీ వాళ్ళు తూరుపు నాటి కొత్త కూలోళ్ళూ, యీళ్ళు వాళ్ళతో పన్లు సేపిచ్చుకొనేవాళ్ళూ అయిపోతారు.



బియ్యం, ఉప్పు, మిరపకాయ, ఉల్లి గడ్డా కొనుక్కోని, పుల్లా పుడకా యేరుకోని, ఉండూ రోళ్ళాల యీ కొత్త కూలోళ్ళు బువ్వొండుకోలేరు. తెల్లార్జామున లేసి, గుంటికెలంబడీ సేలల్లోకి పోయి, సీకటి పన్నాక ఊరు జేరతావుంటారు. అందుకని, యీళ్ళకు పగులు సేలో బెట్టే రొండు ముద్దల సంగటి గాక, రాత్రికి యింటి కాడ యింగో ముద్ద సంగటి పెడ్తారు. అట్ట పెట్టకపోతే, ముందు రోజు మధ్యాన్నం తిన్న సంగట్తో మర్స రోజు మద్యాన్నం దాకా వుండలేరనీ, ఒకేల వున్నా పన్జేయలేరనీ యీ ఏర్పాటు సేస్తారు.

యీ తూరుపునాటి కొత్త కూలోళ్ళకు సంగటి పెట్టల్యాక సచ్చిపోతావుండామని శానామంది తిట్టుకొంటానే వుంటారు గానీ, కసాల కొద్దీ ఉండూరోళ్ళు సాలక వాళ్ళతో పని సేపిచ్చుకోవాల్సిందే. అందుకని ఆ రోన్నాళ్ళూ ఎట్టనో పెడ్తారు. యీళ్ళ సంగతి యిట్టుంటే కూలోళ్ళ సంగతి సూడాల యింగ. మామూలుగానే ఆమని కాలం ఆకలెక్కువ. సేలో తిన్న రొండు ముద్దల సంగటి రొంత సేపు పని సేసేతప్పటికే అరిగిపోతాది. రాత్రి మల్లా ముద్ద సంగటి తినేలోపల వాళ్ళ తనకలాట సూడాల!

ఇంటింటి కాడా గబ్బు సూనె బుడ్డి[4] ఎల్తర్లో వాళ్ళు బేర్లు[5] తీరి కూకోని, ఆ ముద్ద సంగటి కోసం యెప్పుడొస్తాదా అని, సూస్తా వుంటారు. గంపతో ఉడుకుడుకు సంగటి తెచ్చి బయట పెడ్తానే, ఆ వాసన సూసి కూలోళ్ళ పోయే పానం లేసొస్తాది. తలా ఒక ముద్ద సంగటి పెడ్తా వుంటే, ఆ ముద్దను వాళ్ళు ఎంతో బకితితో రొండు సేతుల్తో అందుకోడమూ, అందుకోని ఒక్కొక్క రొవ్వే తుంచుకోని కూరాకులోనో, కారెంలోనో అద్దుకోని, అప్పుడే అయిపోతాదేమోని సూసుకొని సూసుకొని తింటా వుండడం … అబ్జాసి వోళ్ళు బతికినంత కాలం మర్సిపోలేరు. ఆ ముద్ద సంగట్లోకి మూడు మాట్లు పప్పో, కారమో యేయిచ్చుకొంటారు. రొండు మాట్లన్నా, సంగటి గుడ్డ మీద బెట్టి, దోసిడి బట్టి సెంబెడు సెంబెడు నీళ్ళు తాగుతారు. ఆ సలికాలం అన్ని నీళ్ళు తాగేది దప్పికై కాదు, ఆకలి తగ్గిచ్చుకోని ఆ ముద్ద సంగట్తో సరి పెట్టుకోవాలని.

ఆ కూలోళ్ళల్లో బద్వేలు సెరువు కింద అరెకరో, కాలెకరో బూమి వుండేవాళ్ళూ వుండారు. కుంటి మల్లారెడ్డి, బాల్నాగమ్మ, పల్నాటి యుద్దెం కతలూ, గోత్రాలు సేప్పే పిచ్చుకుంట్లోళ్ళూ వుండారు. ఆవుల పబ్బంలో కాటంరాజు కత సెప్పే గొల్లోళ్ళూ వుండారు. తెల్లార్జామున సలికి నొనుక్కుంటా, బీడీలు తాక్కుంటా బండ్లో కూకొని పోయేతప్పుడు యెవురో ఒకరు 'ఓరోరి కాటం రాజో!' అని గంగమ్మ పాటెత్తుకొంటాడు. సీకట్లో మునిగిన సేలన్నీ ఆ పాటతో ఉలిక్కిపడి మేలుకొంటాయి. గుంటి కెనకాల సెనక్కాయ మండ ల్నెదిరి కుప్పలు పెడ్తావుండే ఆయప్పెవరో వున్నట్టుండి, బాలసెంద్రుని సెతిగ్నె ఎత్తుకొంటాడు. గుంటకే గుంజే ఎద్దులక్కూడా వుశారొస్తాది.

పన్లయిపోయిన మర్సనాడు తెల్లార్జామున్నే ఊళ్ళకు బయల్దేరాలని కొత్త కూలోళ్ళు తొక్కులాడ్తారు. జొన్న కోతల్దాకా వుండమంటే "యాదుంటామయ్యా, యింటికాడెట్టుండారో!" అంటారు. ఊళ్ళకు పోయేతప్పుడు, సింపిరి జుట్లతో పెరిగిన గడ్డాల్తో మొగోళ్ళూ, మారు కోక ల్యాక సిరుగుపాతల్తో ఆడోళ్ళూ … యీ రోన్నాళ్ళకే పదేండ్లు పైబన్నట్టు అగుపిస్తారు. పల్లో, ఎండలో, సగం నిండిన కడుపుల్తో వుండి యీ బాల్నాగమ్మలూ, బాలసెంద్రులూ ఎన్నాళ్ళకు సంపాయిచ్చుకోని పోతారో తెల్దు.

పది రోజుల కిందట వాళ్ళ ఊళ్ళల్లో బతుకు తెరువు లేదని వొచ్చినోళ్ళే ఆదరాబాదరా పరుగెత్తా వుండారు. ఈ పది రోజుల్లో యీళ్ళు యెట్టయిపోయినారో సూస్తే పరాయి సోట పన్జేయడం ఎంత దెబ్బో తెలుస్తాది. యిట్టా పనులెతుక్కొంటా పోయి … పోయి … ఆకిరికి పొల్యాక యీళ్ళు గూడా …! ●

1. పంటల కాలం 2. అడిగి తెలుసుకొంటారు.
3. దేవళం, 4. కిరోసిన్ బుడ్డి దీపం. 5.పంక్తులు